క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దెంకాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శంకర్ జగన్నాథం

దెంకాడ: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించాల్సిన పనులపై అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న స్థితిగతులపై ఉన్నతాధికారులు నివేదిక కోరారు. దీనిలో భాగంగా మండలంలోని పలువురు అధికారులను గ్రామాల్లోని ఉన్న పోలింగ్ కేంద్రాల భవనాలు ఎలా ఉన్నాయి. అక్కడ వసతుల పరిస్థితి ఏమిటి, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో వారికి వసతులు ఇబ్బంది లేకుండా ఉంటాయా వంటి పలు అంశాలపై నివేదిక కోరారు. దీంతో ఆయా గ్రామాలకు సంబంధించి కేటాయించిన అధికారులు మంగళవారం ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ ఉన్న పరిస్థితిని పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 8వ రోజుకు మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి హెల్త్ అలవెన్స్, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.బాబూరావు, బి.హరిబాబు, జె.శ్రీను, బి.రాము, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆందోళన



కలెక్టరేట్‌వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, తెలంగాణ రాష్ట్రం మాదిరిగా మన ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్లో గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హరీష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ కోసం నిరుద్యోగ అభ్యర్థులు ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సతీష్, నాయుడు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

బర్దన్ ఆశయాలను కొనసాగిద్దాం



ఏబీ బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజా, కార్మిక వర్గ పోరాటాల్లో 25 ఏళ్ల జైలు జీవితం అనుభవించిన గొప్ప పోరాటయోధుడు అమరజీవి, కామ్రేడ్ ఏబీ బర్దన్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. స్థానిక అమర్ భవన్‌లో ఏబీ బర్దన్ వర్ధంతి కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.రంగరాజు, బి.గౌరినాయుడు, ఎ.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

వంగర: మండలంలోని నీలయ్యవలస పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉద్యోగి సతిపిడకల వెంకటేష్ విద్యాసామగ్రి(నోట్‌పుస్తకాలు, పెన్నులు, అట్ట(ప్లాంక్)లు) మంగళవారం వితరణ చేశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని, తనవంతు సహాయంగా రూ.4 వేల విలువైన విద్యాసామగ్రి అందించానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రాసిన ప్రిపరేషన్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సదస్సులో పాల్గొన్న కోచింగ్ నిపుణులు సర్వేశ్వరరావు అభ్యర్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

హోరా.. హోరీగా.. ‘ఆడుదాం.. ఆంధ్రా’



విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బ్యాడ్మింటన్ పోటీలను టాస్ వేసి ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి

ప్రతిభ గల క్రీడాకారుల గుర్తింపే లక్ష్యంగా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తోన్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు హోరా.. హోరీగా సాగుతున్నాయి. నగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంతో పాటు మండలాల్లో కూడా ఈ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం: పోటీల్లో విజేతలుగా నిలిచిన 7వ డివిజన్ క్రీడాకారులు



విజయనగరం రూరల్: బియ్యాలపేటలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



పూసపాటిరేగ: కొప్పెర్లలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, అప్పలనాయుడు తదితరులు

చిన్నశ్రీను సోల్జర్స్ దాతృత్వం



కనపాకలో రెడ్డి తవుడుకు ఏర్పాటు చేసిన వ్యాపారాన్ని ప్రారంభిస్తున్న సిరి సహస్ర

విజయనగరం: ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుంది. ఇందులో భాగంగా చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర స్థానిక కనపాక తారకరామారావు కాలనీలో నివాసం ఉంటున్న రెడ్డి తవుడును దాతృత్వంతో మంగళవారం ఆదుకున్నారు. గతంలో తమ ఇంటి మేడపై నుంచి పడి వెన్నుముక దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని చిన్న శ్రీను సోల్జర్స్ కార్యాలయానికి విచ్చేసి బతుకు తెరువు కోసం సిరిసహస్రను సహాయం కోరగా స్పందించి వారికి వ్యాపార నిమిత్తం ఒక తోపుడు బండిని, ఫ్యాన్సీ స్టోర్ సామగ్రి అందించి వారి జీవితాల్లో వెలుగును నింపారు. అనంతరం సిరి సహస్ర మాట్లాడుతూ జిల్లా ప్రజలు కష్టాల్లో చిన్న శ్రీను సోల్జర్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలో ఇలా తోపుడు బండి ఇచ్చి పేద కుటుంబాలకు అండగా నిలిచే ఏకైక సంస్థ చిన్న శ్రీను సోల్జర్స్ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు తోటవాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, దక్షిణామూర్తి, శివ, జగదీష్, అభిరామ్, సాయి, జగన్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



అగ్ని ప్రమాద బాధితురాలికి సహాయాన్ని అందిస్తున్న శ్రావణి తదితరులు

విజయనగరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రాజేశ్వరమ్మను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆదుకున్నారు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో వీటి అగ్రహారం సున్నం బట్టి ప్రాంతంలో రాజేశ్వరమ్మ ఇల్లు అగ్నికి ఆహుతి అయింది. ఇంట్లో సామగ్రి అంతా సర్వం కాలి బూడిదయ్యింది. దీంతో ఆవేదనతో ఉన్న రాజేశ్వరమ్మను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మంగళవారం పరామర్శించారు. తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ముందస్తుగా కొంత నగదును, 10 కేజీల బియ్యాన్ని, అవసరమైన వంట సామగ్రి, చీరలు దుప్పట్లను ఆమెకు అందజేశారు. మాజీ వైస్ చైర్‌పర్సన్ లంక వరలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం నాయకురాలు గదుల సత్యలత, స్థానిక కార్పొరేటర్ బాలి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మూడు లాంతర్ల దగ్గర నుంచి ర్యాలీగా వచ్చి గంటస్తంభం కూడలిలో మానవహారం చేపట్టి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పోర్టికో దగ్గర ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తుపాకుల శ్రీను, కల్యాణం శ్రీను, శ్రీను, మున్సిపల్ కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందమయ జీవితానికి మానసిక ఆరోగ్య స్థితి కీలకం

విజయనగరం అర్బన్: ఆనందదాయకమైన జీవితానికి మానసిక ఆరోగ్య స్థితి కీలకంగా నిలుస్తుందని నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సైక్రాయటిస్ట్ మౌనిక తేజస్విని అన్నారు. స్థానిక గురజాడ పబ్లిక్ స్కూల్‌లో రోటరీ క్లబ్ విజయనగరం ఆధ్వర్యంలో ‘మెంటల్ హెల్త్ ఫర్ హ్యాపీనెస్’ అనే అంశంపై మంగళవారం జరిగిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజికల్, మెంటల్ హెల్త్‌పై జాగ్రత్తలు బాల్యం నుంచి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ విజయనగరం అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణ శాంతి, సెక్రటరీ వినీత, రోటరీ సభ్యులు డి.రామమూర్తి పాల్గొన్నారు.

సీతంలో ‘యూనిటీ గేమింగ్ టూల్’పై వర్క్‌షాప్

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ రెండవ, మూడవ తరగతి విద్యార్థుల కోసం ‘యూనిటీ గేమింగ్ టూల్’ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల డైరెక్టర్ డా.మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ గేమింగ్ రూపకల్పన, కార్యనిర్వహణ, కార్యసాధన ఉండాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల విద్యార్థులందరూ వర్క్‌షాప్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ట్రైనీ ఎం.సతీష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచు దుప్పటి



పొగ మంచులో గంటస్తంభం రోడ్డు



రైల్వేస్టేషన్‌లో ఇలా...



మయూరి కూడలిలో..

జిల్లా కేంద్రంలో కొద్ది రోజులుగా మంచు దుప్పటి కప్పుకుంటోంది. దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి ప్రారంభమవుతున్న మంచు ఉదయం ఎనిమిది గంటల వరకు కురుస్తూనే ఉంటోంది. దీంతో వాహనదారులు ఉదయం కూడా లైట్లు వేస్తూ ఇబ్బందికర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. మరోవైపు చలి గాలులు తీవ్రమవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



దోబూచులాడుతున్న సూరీడు

జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మకం



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు
- రామతీర్థంలో రెండో విడత కార్యక్రమం ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని, రాష్ట్రంలో ఆరోగ్య రంగం ఓ విప్లవాత్మకమైనదిగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని రామతీర్థం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అక్కడి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఈ బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నిపుణులైన వైద్యులతో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయాల వారీగా జరగనున్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైద్యాధికారి సాయిరాం, ఎంపీడీఓ రామారావు, సర్పంచ్ కంచరాపు సూర్యకళ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచరాపు రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులకు రుచికరమైన, నాణ్యత కల్గిన భోజనాన్ని అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఎం.ఆర్.ప్రభుత్వ సంస్కృత పాఠశాల, కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు తప్పకుండా మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేయాలని చెప్పారు. ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తోందన్నారు. పాఠశాల వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పిల్లలకు ఒత్తిడి లేని విలువలతో కూడుకున్న విద్యను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీయూ యాళ్ల నాగరాజు, హెచ్‌ఎం లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

6,122 మందికి పింఛన్లు

విజయనగరం రూరల్: అవ్వాతాతలకు, వితంతు మహిళా సోదరీమణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి సంబరాలను పది రోజుల ముందుగానే తీసుకువచ్చారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా దశల వారీ పింఛన్ల పెంపును నాలుగు దఫాల్లో పూర్తి చేసి నేటి నుంచి అన్ని రకాల లబ్ధిదారులకు రూ. 3 వేలను అందించడానికి శ్రీకారం చుట్టనున్నారు. విజయనగరం మండలంలో 13 గ్రామ సచివాలయాలు ఉండగా వాటి పరిధిలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2019కి ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో రూ.1000ల చొప్పున కేవలం 3900 పింఛన్లు మాత్రమే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కళాకారులకు అందించేవారు. వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రస్తుతం ప్రతీ లబ్ధిదారునికి గ్రామ వలంటీర్ల ద్వారా రూ.2750 చొప్పున వారి ఇంటి వద్దనే అందిస్తున్నారు. ఈ నెల నుంచి 22 గ్రామ పంచాయతీల్లో 6122 మందికి రూ.3000లు అందించనున్నారు. గత నెల వరకు 6021 పింఛన్లు అందించగా, ఈ నెల కొత్తగా మరో 101 మందికి పింఛన్లు మంజూరు చేసి వారికి రూ.3 వేలు పింఛను అందించనున్నామని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల పింఛనుతో లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్నారు.



పింఛను పంపిణీ చేస్తున్న గ్రామ వలంటీరు

కొత్త పెన్షన్ల జాబితా పరిశీలన

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమామణితో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు మంగళవారం సమావేశమై, కొత్త పెన్షన్ల జాబితాను పరిశీలించారు. ఎంతమందికి కొత్తగా పింఛన్ మంజూరైంది.. ఈ నెల పింఛన్ ఎంత మొత్తంలో ఉంది.. కొత్త, పెంచిన పింఛన్ల పంపిణీ వంటి తదితర అంశాలపై ఎంపీపీ చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో 9,049 మంది లబ్ధిదారులకు రూ.88,77,92,250లను వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, అందజేశారని తెలిపారు. ఈ నెలలో 7,811 పాతవారు, 126 మంది కొత్త వారికి మొత్తం రూ.237 కోట్లు నేరుగా వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇకనుంచి ఒక్కో లబ్ధిదారునికి నెలకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం పింఛన్ అందిస్తుందన్నారు.



కొత్త పెన్షన్ల జాబితాను పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, పక్కనే ఎంపీడీవో రమామణి

ఘనంగా విగ్రహ ఊరేగింపు

బొబ్బిలి: స్థానిక తారకరామా కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా పల్లకీలో ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం భక్తులకు శ్రీరామ అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో బలిజేపల్లి రామజోగారావు, కౌన్సిలర్ వాడపల్లి వనజామనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

రామభద్రపురం: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, మండలంలోని బూసాయవలస, ముచ్చెర్లవలస గ్రామాల్లో అక్షింతలు పంచిపెట్టారు. దేశంలోని భక్తులందరికీ ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం కల్పించేలా అక్షింతల పంపిణీ చేపట్టినట్లు వేంకటేశ్వరాలయ ధర్మకర్త కోరాడ మహేష్, బూశాయవలస ఉప సర్పంచ్ రౌతు వెంకటలక్ష్మి తెలిపారు.